# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **తెలంగాణలోని మంచిర్యాల జిల్లా ముధిగుంట గ్రామంలో ప్రజలు సంఘటితంగా నీటి సమస్యను పరిష్కరించుకున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**

2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు తిరుపతి జిల్లాలో పర్యటిస్తారు.**

3. **తెలంగాణ శాసనసభ 'పేరెంటల్ సపోర్ట్ చట్టం-2026'కు నిన్న ఆమోదం తెలిపింది.**

4. **పట్టణాలకు దీటుగా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.**

5. **నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు క్రీడలు, వ్యాయామం ఎంతో అవసరమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**

==========================

తెలంగాణలోని మంచిర్యాల జిల్లా ముధిగుంట గ్రామంలో ప్రజలు సంఘటితంగా నీటి సమస్యను పరిష్కరించుకున్నారని మన్ కీబాత్ 132 సంచికలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిన్న పేర్కొన్నారు. జలసంరక్షణ ప్రధాన మంత్రి ప్రాముఖ్యతను గుర్తించి గ్రామంలోని 400 కు పైగా కుటుంబాలు ఇంకుడు గుంతలను ఇంట్లోనే ఏర్పాటు చేసుకున్నాయని పేర్కొన్నారు. వారు నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చరని పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు తిరుపతి జిల్లాలో పర్యటిస్తారు. ఉదయం అమరావతి నుంచి జిల్లాలోని నాయుడుపేట మండలం, పుదూరుకు చేరుకుంటారు. లబ్ధిదారులతో టిడ్కో ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. గృహప్రవేశాల అనంతరం లబ్ధిదారులతో ముఖ్యమంత్రి ముచ్చటిస్తారు. ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి కార్యకర్తలు, నేతలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం అనంతరం తిరుపతిలో నిర్వహించే పీ4 వార్షికోత్సవ సభలో పాల్గొంటారు.

---------------------------

'పేరెంటల్ సపోర్ట్ చట్టం-2026'కు తెలంగాణ శాసనసభ నిన్న ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... పిల్లల కోసం తల్లిదండ్రులు తమ శక్తినంతా ధారపోస్తారని, పిల్లలు మాత్రం పెద్దవారు అయ్యాక వారి తల్లిదండ్రుల్ని పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు పిల్లలు అండగా నిలవాలనే ఈ చట్టం తీసుకొచ్చినట్లు శాసన సభలో చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి వెల్లడించారు. ఆత్మీయతకు సంబంధించిన అంశంపై చట్టం తీసుకురావడం బాధాకరమన్నారు. తల్లిదండ్రుల పట్ల కఠినంగా వ్యవహరించిన వారిని దారిలో పెట్టాలని పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు క్రీడలు, వ్యాయామం ఎంతో అవసరమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి క. అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్ల కేంద్రంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన 'రెవెన్యూ ఉద్యోగుల క్రీడా, సాంస్కృతిక పోటీలు' నిన్నటితో ముగిశాయి. ఈ వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం లభిస్తుందన్నారు. రెవెన్యూ వ్యవస్థ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి వంటిదని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించి శాఖ గౌరవాన్ని పెంపొందించాలని సూచించారు.

---------------------------

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, గోదావరి పుష్కరాల నిర్వహణకు అనువైన ప్రదేశాలను గుర్తించడానికి ఇంజనీర్లతో సాంకేతిక కమిటీని నియమించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి వచ్చే 15, 20 రోజుల్లో నివేదికను సమర్పించాలని సూచించారు. 2027 జూన్‌లో జరగబోయే గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలపై హైదరాబాద్ లో మంత్రివర్గ ఉపసంఘం, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పుష్కరాల నాటికి పూర్తి చేయాల్సిన పనులపై సమావేశంలో చర్చించారు. పుష్కరాల కోసం రూపొందించిన ప్రణాళికలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వాటిపై ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు.

---------------------------

పట్టణాలకు దీటుగా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో కోటి 64 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అభివృద్ధి, సంక్షేమం అమలు కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీరు, రహదారులు, మురుగు కాల్వలు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాట్లు చేశామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ఆరోగ్య ఉపకేంద్రాల నుంచి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల వరకూ ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తూ సమగ్ర మార్పులు తీసుకువస్తున్నట్లు తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శాసన సభలో నిన్న ప్రకటించారు. బడ్జెట్ పద్దుపై జరిగిన చర్చకు ఆయన సమాధానమిస్తూ.. ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో డాక్టర్లపై పనిభారం తగ్గించేందుకు మెడికల్, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్‌ను విభజించనున్నట్లు వెల్లడించారు. గత రెండు సంవత్సరాల్లో 9 వేల 5 వందల 72 పోస్టులను భర్తీ చేసినట్లు చెప్పారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ – ఐపీఎల్ 2026లో ముంబయిలోని వాఖండే స్టేడియంలో నిన్న జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్ 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 220 పరుగులు చేయగా... ఈ లక్ష్యాన్ని ముంబయి ఇండియన్స్ నాలుగు వికెట్లు కోల్పోయి 19.1 ఓవర్లలో ఛేదించారు.

---------------------------

ఉత్తర ఒడిశా పై ఉన్న ఉపరితల ఆవర్తనము నుండి దక్షిణ ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, అంతర కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రాయలసీమ పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

వాయిస్..20 సెకన్లు

మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో ఈరోజు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు రాష్ట్రంలోని మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, ఆదిలాబాద్, కొమరం భీమ్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, సిద్దిపేట, యాదద్రి భువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని కడప జిల్లా కలక్టరేట్‌లో ఈరోజు నిర్వహించాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు డిఆర్వో మల్లిఖార్జున తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రం ఒంటిమిట్టలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చె నెల 1వ తేదీన పర్యటించనున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన పర్యటన ఏర్పాట్లులో అధికారయంత్రాంగం నిమగ్నమై ఉన్నందున ఈరోజు నిర్వహించాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

===============